ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఆకాంక్షలు అనేకం..

(మొదటిపేజీ తరువాయి)

అధిగమించాల్సిన బాధ్యత కొత్త పాలకులపై ఉంది. అందుకు కార్యాచరణే కీలకం. అవసరమైన నిధులు రాబట్టడం అంతకన్నా కీలకం. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. బాధ్యతలు చేపట్టగానే సిఎం చంద్రబాబు ఐదు అంశాలపై సంతకాలు చేశారు. దీంతో వివిధ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. అన్ని వర్గాలూ వివిధ కారణాలతో గత ప్రభుత్వంపై అసంతృప్తిలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు వ్యక్తిగతంగానూ ప్రజలు, సామాన్యులు ఎమ్మెల్యేల వద్ద గోడు పెట్టుకుంటున్నారు. వాటిని పరిష్కారం చేయడం అంటే రానున్నకాలంలో పెద్ద పరీక్షగానే చెప్పక తప్పదు. సంక్షేమ పథకాలు పెద్దఎత్తున అమలు చేస్తున్నా ఇంకా ఎక్కడో లబ్ధిదారుల్లో అసంతృప్తి ఉంది. ఇంకా పథకాలు అందని పేదలూ ఉన్నారు. అర్జీలు తీసుకుని కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం వస్తూనే ఉన్నారు. భూముల వివాదాలు పెద్దఎత్తున ముందుకు వచ్చాయి. కబ్జాలు, కుంభకోణాలు, ఆక్రమణలు, నకిలీ పత్రాలతో వివాదాలకు తెరలేపారు. వీటిని పరిష్కారం చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ల్యాండ్ టైట్లింగు యాక్టును రద్దు చేశారు. అదే తరహాలో ఇటీవల వెలుగుచూసిన భూకుంభకోణాలపైనా దృష్టి సారించాలి. ఇసుకను ఉచితంగా అందించాలి. ఉపాధిని పెంచే అంశాలపై కేంద్రీకరించాలి. చదువుకున్న యువతకు ఉద్యోగాల్లేవు. నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా అభివృద్ధి ఐదేళ్లలో పడకేసింది. దొనకొండ, కనిగిరి వద్ద ఉన్న పారిశ్రామిక వాడలపై దృష్టి పెట్టాలి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. సాగర్ కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. వాటి మరమ్మతులు లేక చివరి భూములకు నీళ్లందడం లేదు. నీటి వనరులపై సమగ్ర విధానం ఉండాలి. ఇక జిల్లాకు కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభించారు. 7 వేల మంది నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు. వారికి చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు. పునరావాసం ముందుకు సాగలేదు. గుండ్లకమ్మ మరమ్మతులు పెండింగులోనే ఉన్నాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేయించాల్సి ఉంది. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. తెలుగుదేశం అధినేత, ప్రస్తుత సిఎం చంద్రబాబు కూడా దీన్ని సందర్శించారు. ఇక జిల్లాల ఏర్పాటుపై ప్రజల్లోనే కాకుండా అన్ని పార్టీల్లోనూ అసంతృప్తి ఉంది. పాలనా సౌలభ్యంగా జిల్లాలే ఏర్పాటు లేదు. కూటమి ఎన్నికల హామీల్లో మార్కాపురం జిల్లా ఏర్పాటు, అద్దంకి, కందుకూరును ఒంగోలు జిల్లాలో కలపడం వంటివి ప్రధాన హామీలుగా ఉన్నాయి. అభ్యర్థులతో పాటు అధినేత చంద్రబాబు కూడా వీటిపై హామీ ఇచ్చారు. పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కూడా పాదయాత్రలో వీటిపై స్పష్టంగా చెప్పారు. అన్నిటికన్నా ముందు జిల్లాల ఏర్పాటుపైనే అందరి దృష్టి ఉంది. ఇంకా ఏళ్ల తరబడి పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ఆగిపోయింది. పాలేటిపల్లె రిజర్వాయర్ పనులు ఆగిపోయాయి. వీటితోపాటు పేదలకు ఇచ్చిన ఇళ్లు ముందుకు సాగలేదు. ఒంగోలులో ఆఖరు నిమిషంలో ఇచ్చిన పట్టాలపైనా పేదల్లో అపోహలున్నాయి. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రెండు సెంట్లు ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు వాటిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. మరో వైపు వాటిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఇంకా జిల్లా డెయిరీపైనా హామీలు ఇచ్చారు. వీటితో పాటు ప్రతి నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న కీలకమైన సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులు హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఇవి కూడా భవిష్యత్ ఎజెండాలోకి వచ్చాయి. ఇద్దరు మంత్రులూ జిల్లాలోని ఈ కీలక అంశాలపై త్వరలో దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.332

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శనివారం మద్దులూరు క్లస్టర్ రైతులు 664 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 622 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 42 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర 332 రూపాయలు పలుకగా అత్యల్ప ధర 205 రూపాయలు పలికింది. సరాసరి కిలో ధర 298.73 రూపాయలు పలికింది. వేలంలో 33 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

'వెలిగొండ' రెండో దశ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కనిగిరి

వెలుగొండ ప్రాజెక్టు రెండో దశ పనులు ప్రారంభించడంపై ఎన్నికైన పశ్చిమ ప్రాంత టిడిపి శాసనసభ్యులు దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈరోజు స్థానిక సుందరయ్య భవన్లో ఆర్ ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తొలుత ఇటీవల జరిగిన ఎన్నికల్లో కనిగిరి శాసనసభ్యుడిగా ఎన్నికైన ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి సిపిఎం అభినందనలు తెలియజేసింది. కొండారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ రెండో దశ పూర్తయితేనే కనిగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. నియోజకవర్గంలో మోపాడు చెరువుకు వెలిగొండ నీరు ఇవ్వడం, పీసీపల్లి మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. కనిగిరి పట్టణంలో ఇంటింటికి రక్షిత మంచినీరు అందించే పథకం చేపట్టడంపై నూతన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కనిగిరి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పడినందున అక్కడ ప్రభుత్వ రంగంలో ఐటిఐ, పాలిటెక్నిక్, బిఎడ్, డిఎడ్, ఇంజనీరింగ్ కాలేజీలను, పామూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే కనిగిరి నియోజకవర్గంలో తొలుత ప్రతిపాదించినట్లుగానే ట్రిపుల్ ఐటీ కాలేజీని స్థాపించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు కనిగిరి నియోజకవర్గంలో తక్షణమే పూర్తి చేయటంపై శ్రద్ధ వహించాలన్నారు. సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు మాట్లాడుతూ కనిగిరి ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి వైద్య సేవలు మెరుగుపరచాలని కోరారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ, మురికివాడలో మౌలిక సదుపాయాల కల్పనపై నూతన ప్రభుత్వం కేంద్రీకరించాలని అన్నారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులను ఖాళీ చేయించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు మాలకొండయ్య, ఎస్‌కే బషీర, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు సుబ్బారావు

కందులకు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి-పొదిలి: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాన్ని గీసిన పొదిలికి చెందిన చిత్రకారుడు పచ్చవ సుబ్బారావు ఆ చిత్ర పటాన్ని మార్కాపురంలోని టిడిపి కార్యాలయంలో శాసనసభ్యులు నారాయణ రెడ్డికి అందజేశారు. తన చిత్ర పటాన్ని అద్భుతంగా గీసిన పచ్చ సుబ్బారావును కందుల అభినందించారు. రామాపురం టిడిపి నాయకులు ఓబయ్య, పట్టణ మైనార్టీ నాయకులు ముల్లా బుచ్చిబాబు పాల్గొన్నారు.



విద్య సామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పట్టుదలతో చదివితే లక్ష్య సాధన: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కృషి, పట్టుదలతో చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరవచ్చని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా విద్యార్థులను, ఉపాధ్యాయులు తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా తన దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు డివి సుబ్బారావు, యువి నారాయణరెడ్డి, సంజీవరావు, రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎంల సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి రామిరెడ్డి, ఉపాధ్యాయులు పి రత్నం, టిడిపి నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, నంబల కొండయ్య, తమ్మినేని సురేంద్ర, అచ్చాల రవి, వీర్ల కిషోర్, ఐవి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంపుపట్ల వికలాంగుల హర్షం

ప్రజాశక్తి-మార్కాపురం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకునే విధంగా వికలాంగులకు నెలకు రూ.6 వేలు పింఛను అమలు చేస్తామని చెప్పడం పట్ల వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్థానిక శ్రీనివాస థియేటర్ ప్రాంతంలో మార్కాపురం పట్టణ వికలాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా పింఛను రూ.6 వేలు ఇవ్వడం సరైన నిర్ణయమని దివ్యాంగుల విభాగం పట్టణ అధ్యక్షుడు చెముడురి సురేంద్ర పేర్కొన్నారు. వికలాంగులు చంద్రబాబుకు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు రమణారెడ్డి, రెహమాన్, వెంకటరమణ, అశోక్, శేఖర్, పీరా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు ఫోటోకు పాలాభిషేకం

'వెలిగొండ'ను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి హనుమారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం మన్నే సాంబశివరావు అధ్యక్షతన జరిగింది.

కందులను కలిసిన స్వర్ణ గీత

ప్రజాశక్తి-పొదిలి

మార్కాపురం శాసనసభ్యులుగా ఎన్నికైన కందుల నారాయణరెడ్డిని శనివారం పొదిలి మాజీ సర్పంచ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కందులను కలిసిన ఆమె పలు విషయాలు చర్చించారు. మంచి మెజార్టీతో విజయం సాధించిన కందులకు పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. మరొక కార్యక్రమంలో కెకెమిట్ల మండల టిడిపి మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పొదిలి మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు మీగడ ఓబుల్‌రెడ్డిలు ఎమ్మెల్యే కందులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కందులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ గీత

ఎమ్మెల్యేకు ఖాజీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజానాయకుడిని మరొకసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం సంతోషంగా ఉందని ప్రభుత్వ ఖాజీ షేక్ నాయబ్ రసూల్, సున్ని ఆంజుమన్ కమిటీ జిల్లా అధ్యక్షులు నాయబ్ ఖాజా అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు 2014లో కూడా ఎమ్మెల్యే గెలిచిన అశోక్‌రెడ్డి నియోజకవర్గం అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజారంజక పాలన సాగించారని, 2024లో కూడా అదే పరిపాలన అందిస్తారని ఆశించినట్లు తెలియజేశారు. వారితో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఆకాంక్షలు అనేకం..

- తీరే మార్గం కోసం జనం ఎదురుచూపులు
- మార్కాపురం జిల్లా ఏర్పాటు.. అద్దంకి, కందుకూరు విలీనం..
- వెలిగొండ నిర్వాసితులకు అందని పరిహారం..
- 'గుండ్లకమ్మ'కు మరమ్మతులు
- ఇద్దరు మంత్రులకూ సవాలుగా జిల్లా అభివృద్ధి.. ఎన్నికల హామీల అమలు



వెలిగొండ ప్రాజెక్టు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రజల ఆకాంక్షలు అనేకం ఉన్నాయి. మరో వైపు కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలూ పెద్దఎత్తున ఉన్నాయి. గత ప్రభుత్వంపై అనేక సమస్యలపై దుమ్మెత్తిపోసిన కూటమి అభ్యర్థులు ఇప్పుడు వాటిని పరిష్కారం చేయడం పెద్ద ఎజెండాగా మారింది. ఎన్నికల్లో అఖండ విజయాన్ని ఇచ్చిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం ఇప్పుడు ముందున్న ప్రధాన కర్తవ్యం. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఇద్దరు అమాత్యులున్నారు. ఎన్నడూ లేని అవకాశం వచ్చింది. ఉమ్మడి జిల్లాగా చూస్తే అద్దంకి నుంచి గొట్టిపాటి రవికుమార్‌కూ, కొండపి నుంచి వీరాంజనేయస్వామికి మంత్రివర్గంలో చోటుదక్కింది. గతంలో జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులు దక్కిన సందర్భం లేదు. ఇప్పుడా అవకాశం వచ్చింది. కూటమి అభ్యర్థులపై ఎంతో నమ్మకంతో ఓటేశారనే చెప్పాలి. వైసిపి అభ్యర్థులు గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన నియోజకవర్గాలు సైతం ఇప్పుడు ఓటమిని చవిచూశాయి. అంటే గత ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఎవరూ ఫలితాలు వచ్చే వరకూ గుర్తించలేదు. ఉద్యోగుల నుంచి మొదలైన వ్యతిరేకత సామాన్యుడి వరకూ చేరింది. అందుకు అనేక కారణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఓటమికి కారణాల్లో అనేక అంశాలతో విశ్లేషణలు వస్తున్నాయి. ఇప్పుడు వాటిని ▶ 2లో

'అతిసార'తో 20 మందికి అస్వస్థత 5లో



బహుమతి అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రతిభకు యుటిఎఫ్ ప్రోత్సాహం

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించటం వలన వారిలో మరింత ఉన్నతంగా చదువుకునేందుకు దోహద పడుతుందని యుటిఎఫ్ జిల్లా కోశాధికారిఎం వెంకటేశ్వర రెడ్డి అన్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బివి శ్రీనివాస్ అధ్యక్షతన వెంకటేశ్వరరెడ్డి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వైవి నారాయణ మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మండల ప్రథమ స్థానంలో నిలిచిన జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ రెహాన్, ద్వితీయ స్థానం పొందిన యాజలి ఉన్నత పాఠశాల విద్యార్థి రేవంత్ కుమార్, తృతీయ స్థానం పొందిన వై సిరికి ప్రోత్సాహంగా కాలేజీ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రతినిధులు ఇ పోలీసురావు, సిహెచ్ ప్రభాకర్, కె సతీష్ కుమార్, బి శ్రీనివాసరావు, సిహెచ్ అజయ్ కుమార్, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రేపల్లె

ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ స్థానిక కోర్టు ఆవరణలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జ్ టి వెంకటేశ్వర్లు తెలిపారు. కోర్టు హాలులో పోలీసు అధికారులు, సిబ్బందితో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ పిటి కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిని సత్వరం పరిష్కరించేందుకు వీలుగా కక్షిదారులతో మాట్లాడి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూప శ్రీ, సిఐ ఎం నజీర్ బేగ్, మల్లికార్జునరావు, ఎస్ఐ హరిబాబు, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, అడవులదీవి, చోడాయిపాలెం, రేపల్లె పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఎక్సైజ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్, ఎపిపి వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



గోశాల వద్ద చెత్త తొలగించిన పారిశుద్ధ్య సిబ్బంది

చెత్త తొలగించిన అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో పారిశుద్ధ్యం లోపించి ఆయా ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 'ప్రజాశక్తి' దినపత్రికలో "మురుగు పారదు. చెత్త తొలగించరు" శీర్షికతో ప్రచురించిన కథనానికి మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి స్పందించారు. గోశాల, వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో పేరుకుపోయిన చెత్త, గోరంట్ల హాస్పిటల్ వద్ద ఇతర ప్రాంతాల్లోని చెత్తను శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లించారు. కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్యం, డ్రైనేజీ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈపాటికే ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి కూలి డబ్బు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధి కూలీలకు ఐదు వారాలుగా కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉందని, వెంటనే నగదు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అప్పికట్ల, భర్తిపూడి, ఈతేరు, గుడిపూడి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతాల్లో కూలీలు వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు చెల్లించాల్సిన కూలి డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్‌ను సోమవారం కలుసి ఉపాధి కూలీల సమస్యలు వివరిస్తామని అన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిందని అన్నారు. ట్రాక్టర్లు, పంట కోతమిషన్లు వలన కూలీలకు పనులు తగ్గిపోతున్నాయని అన్నారు. రెండు పూటల ఉపాధి హామీ పనితో కూలీలు వ్యవసాయ, ఇతర ఇంటి పనులు చేయలేక పోతున్నారని అన్నారు. రెండు పూటల పని ప్రాంతాలకు కిలోమీటర్లమేర దూరం నడవలేక పోతున్నారని అన్నారు. ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. కూలీలకు మజ్జిగ, మంచి నీరు, గతంలో ఇచ్చినట్లే ఇవ్వాలని కోరారు. మేట్‌లకు ప్రోతహం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని అన్నారు. నిత్యవసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రూ.600 రోజు కూలి ఇవ్వాలని కోరారు. ప్రతివారం ఇచ్చే ప్లే సిప్పులు ఇవ్వడంలేదని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే దిశగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. కూలీలు సమిష్టిగా పోరాడి ఉపాధి హామీ చట్టాన్ని నిలబెట్టు కోవాలన్నారు. సంఘంలో చేరి పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మేట్లు షేక్ మస్తాన్ వలి, రత్తయ్య, అరుణ, యోహాన్ రాజు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఉపాధి పని ప్రదేశాల్లో కార్మిక సంఘం నాయకులు

కార్మిక వర్గ పోరాటాలే నిజమైన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

కార్మిక వర్గ హక్కుల సాధనకై నిరంతరం చేసే పోరాటాలే అమరవీరులకు నిజమైన నివాళి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. సిఐటియు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ పర్స సత్యనారాయణ శత జయంతిని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పర్స చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మజుందార్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ 1970 నుండి 2002 వరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగా అనేక కార్మిక వర్గ పోరాటాల్లో భాగస్వాములు అయ్యారని చెప్పారు. 1966లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో జరిగిన పోరాటంలో శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఆయన జీవిత కాలంలో తొమ్మిదేళ్ళు జైలు జీవితం గడిపి చివరివరకు కార్మికుల హక్కుల కోసం పోరాడారని అన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టడమే ఆయనకు ఇచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె శరత్, కె కుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు ఓ లక్ష్మణ, నిరంజన్, శ్రీనివాసరెడ్డి, ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మజుందార్

సమాజాన్ని మేల్కొలిపిన శ్రీశ్రీ సాహిత్యం

ప్రజాశక్తి - బాపట్ల

సామ్యవాద సమాజ నిర్మాణానికి తన కలాన్ని, గళాన్ని అంకితం చేసిన గొప్ప కవి శ్రీశ్రీ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎంజి బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీశ్రీపై వచ్చిన నూతన పుస్తకాలను ఆవిష్కరించారు. కష్ట జీవుల పక్షాన నిలబడి శ్రమైక జీవన సౌందర్యానికి శ్రీశ్రీ పెద్ద పీట వేశారని అన్నారు. తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ కవిత్వాలకు ఆయన అద్యుడని అన్నారు. తెలుగు సాహిత్యంలో ఎర్రజెండాని, ప్రపంచ సాహిత్యంలో తెలుగు జెండాని శ్రీశ్రీ ఎగురవేశారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడ్డ ప్రజాకవిగా ఖ్యాతికెక్కారని చెప్పారు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని అన్నారు. సాహిత్యంలో శ్రీశ్రీ మార్గం అనితర సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి రమాదేవి, సంస్కృత ఉపాధ్యాయుడు బోడపాటి కృష్ణ పాల్గొన్నారు.



శ్రీశ్రీ కొత్త పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సాయిబాబు

సాహితీ భారతీ ఆధ్వర్యంలో సాహితీ భారతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ 41వ వర్ధంతి నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సహితి భారతీయ అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, ఉపాధ్యక్షులు మాల్యాద్రిరావు, ప్రజాకవి ఎస్ శ్రీనివాస్, ఆదం షఫీ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, మున్నం మస్తాన్‌రెడ్డి, కీర్తి వెంకయ్య, కొమ్మూరి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

వలస పక్షులకు అవకాశం ఇవ్వొద్దు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నిన్న మొన్నటి వరకు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వైసీపీ చెందిన వలస పక్షులు టిడిపిలో చేరటానికి ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారికి అవకాశం ఇవ్వొద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తోని గుంట్ల సాయిబాబా అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి నేడు పార్టీని గెలిపించుకోగా వైసీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వారి సన్నిహితుల ద్వారా తెలుగుదేశంలో చేరటానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుందని అన్నారు. ఇలాంటివారికి అవకాశం ఇస్తే కష్టపడి పనిచేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయని సూచించారు. వైసీపీ గెలుపు కోసం నిరంతరం కృషి చేసిన వారి అవినీతి అక్రమాలు కప్పిపుచ్చుకొని రక్షణ పొందేందుకు టిడిపిలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. వారిని చేర్చుకుంటే ముమ్మందు తెలుగుదేశం కార్యకర్తలతో నాయకులకు ఇబ్బందులు తప్పవన్నారు. ప్రస్తుతం వాళ్లను చేర్చుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.



తూనుగుంట్ల సాయిబాబా



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

విద్యార్థుల భవిష్యత్తుకు సహకారం

ప్రజాశక్తి - బాపట్ల

ఉచిత విద్య ద్వారా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అన్ని విధాలా ప్రభుత్వం సహకారం అందిస్తోందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలోని మంతెన సుబ్బరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం పాఠ్య పుస్తకాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వచ్ఛందంగా తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. చదువుల తల్లిగా విరాజిల్లుతున్న ఖాజీపాలెంలో ప్రశాంతంగా విద్యార్థులు విద్య నభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని అన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వేముల భూపతిరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



రగ్బీ క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న నరేంద్రవర్మ

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం కెవిఆర్ అండ్ ఎంకెఆర్ డిగ్రీ కళాశాల్లో జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్తాయి రగ్బీ క్రీడా పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించి రగ్బీ క్రీడతో పాటు ఇతర క్రీడల పట్ల వారిని మరింత ప్రోత్సహించాలని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థి దశలోనే క్రీడల పట్ల ఉత్సాహం కనబరుస్తున్న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించి మెరుగైన శిక్షణ ఇవ్వాలని అన్నారు.



సమావేశం మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జైసన్ బాబు

కౌన్సిల్‌లో అజెండా ఆమోదం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అజెండాలోని రెండు అంశాలు మినహా 9 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మొదటి రెండు అంశాలపై అభ్యంతరాలు రావడంతో వాయిదా వేశారు.

రంగులు తొలగింపు

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన ఆ పార్టీ రంగులు చిన్నగా తొలగిపోతున్నాయి. మండలంలోని గొల్లవారిపాలెం తదితర గ్రామాల్లో వైసిపి రంగులను తుడిచివేసి కొత్త రంగులు వేస్తున్నారు. వివిధ సచివాలయాలపై వైసిపి రంగులతో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించి నూతనంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024



వైద్యశిబిరం ఏర్పాటుచేసిన వైద్యులు, సిబ్బంది

'అతిసార'తో 20 మందికి అస్వస్థత

అక్కివారిపాలెంలో వైద్యశిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెదపూలివరు పంచాయతీలోని అక్కివారిపాలెం గ్రామంలో గత రెండు రోజులుగా తాగునీటి కలుషిత కావడంతో అతిసార వ్యాధి సోకి 20మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న వెల్లటూరు పిహెచ్‌సి వైద్యులు సిహెచ్ రామలక్ష్మి, కపా సుమతి ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. రోగులను గుర్తించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. గుర్తించిన రోగులకు మందులు పంపిణీ చేసి.. నీరసంగా ఉన్నవారికి సెలైన్‌లు ఎక్కించారు. ఆరుగురు మహిళలను మెరుగైన చికిత్స నిమిత్తం చెరుకుపల్లి, తెనాలి వైద్యశాలలకు తరలించారు. విషయం తెలుసుకున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ విజయమ్మ, జిల్లా ఎపిడమిక్ విభాగం సిబ్బంది శనివారం గ్రామాన్ని సందర్శించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. పూర్తిగా ప్రజలు కోలుకునే వరకు శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అతిసార వ్యాధి సంక్రమించడానికి కారణాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు.

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతిపక్ష హోదాలో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. ఒంగోలు మల్లయ్య లింగం భవనంలో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబించిన బిజెపికి పోరాటాల ద్వారా తగిన గుణపాఠం నేర్పామన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు, రావూఫ్, వెంకటేశ్వర్లు, సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి పాల్గొన్నారు.

సమిష్టి కృషి వల్లే

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించగలిగాం

- ఎస్పీ వకుల్ జిందాల్ - 66 మంది పోలీసులకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పోలీస్ అధికారుల సమిష్టి కషి వల్లనే ఎన్నికల ప్రక్రియను సమర్ధవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో ఎస్పీ జిల్లా పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులు అత్యంత సమర్ధవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లాలోని పోలీస్ అధికారులు ఎన్నికలలో ఏవిధంగా విధులు నిర్వహించారు. వారికి ఎదురైన సమస్యలు.. వాటిని అధిగమించిన తీరు.. వారి అనుభవాలను తోటి పోలీస్ అధికారులతో పంచుకున్నారు. జిల్లా ఎస్పీ ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేయడం వల్లే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్ధవంతంగా విధులు నిర్వహించారన్నారు. జిల్లా పోలీస్ శాఖ మొత్తం సమిష్టిగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లనే నామినేషన్స్ సమయంలో, ఎన్నికల వేళ, ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామన్నారు. పోలింగ్ రోజు కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. ముందస్తుగా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నప్పటికీ అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ పోలీస్ అధికారులు వేగంగా స్పందించి శాంతిభద్రతలను పరిరక్షించారన్నారు. పోలీస్ అధికారులను అప్రమత్తం చేసి శాంతి భద్రతలను పరిరక్షించేందుకు 'సమర్ధ మొబైల్ యాప్' ఎంతగానో ఉపయోగపడిందన్నారు. దీనివల్ల ఎక్కడైనా ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి చేరుకునే విధంగా ఎప్పటి కప్పుడు పర్యవేక్షించగలిగామన్నారు. ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం అంకిత భావంతో, కఠోర శ్రమతో విధులు నిర్వహించిన జిల్లా పోలీస్ అధి కారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అడిషనల్ ఎస్పీ టీ.పీ.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, బాపట్ల డిఎస్పి సిహెచ్ మురళీకష్ణ, సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, ఏ.ఆర్ డిఎస్పి ఎస్.చంద్రమోహన్, 14 మంది సీఐలు, ఇద్దరు ఆర్.ఐలు, 9 మంది ఎస్సైలు, 35 మంది పోలీస్ సిబ్బందికి మొత్తం 66 మందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ఎస్పీ అందజేశారు. సమావేశంలో జిల్లాలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

నరసింహుని బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

చైర్మన్ పామర్తి మాధవరావు

ప్రజాశక్తి-శింగరాయకొండ



మాట్లాడుతున్న చైర్మన్ పామర్తి మాధవరావు

పాత శింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని చైర్మన్ పామర్తి మాధవరావు కోరారు. శని వారం నాడు దేవస్థానంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అన్నిఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. 23వ తేదీన ఆదివారం ఉదయం కళ్యాణోత్సవం సాయంత్రం రథోత్సవ కార్యక్రమాన్ని 19వ తేదీన పొట్టేలు పందాలు 20వ తేదీన బండలాగుడు 21వ తేదీన రాదాడు పోటీలు శ్రీకృష్ణయాదవ్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతాయని, ఈ కార్యక్రమాల్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్యనిర్వాహణాధికారి పి.కృష్ణవేణి ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూల్‌రోడ్డులోని సమస్యలు పరిష్కరించాలి..

షాపు ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న లక్ష్మణకుమార్‌రెడ్డి

ఒంగోలు, కర్నూలు రోడ్డులోని సమస్యలను కార్పొ రేషన్ అధికారులు, పాలకులు పరిష్కరించాలని కర్నూల్ రోడ్ షాపు ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు కోరారు. అసోసియేషన్ సభ్యుల సమావేశం కర్నూలురోడ్డులోని సీసీ కేఆర్ కాన్ఫరెన్స్ నందు అసోసియేషన్ అధ్యక్షులు చేరెడ్డి లక్ష్మణకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కర్నూలురోడ్డులోని కాలువలు సరిగా లేక వర్షం వస్తే రోడ్లన్నీ వర్షపునీటితో మునిగి షాపుల్లోకి నీళ్లు వస్తున్నాయన్నారు. కార్పొరేషన్ మేయర్, కమిషనర్ కర్నూల్ రోడ్డును సందర్శించి కాలువలు, పూడికలు తీయించి వర్షపు నీటిని పోతురాజు కాలువలో పోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణకుమార్‌రెడ్డి, అసోసియేషన్ ట్రెజరర్ ఉన్నవ వెంకటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు, బత్తుల ముసలారెడ్డి, అమత శంకర్రావు, నీడ్స్ సుబ్బారావు, బేరింగ్ షాప్ కొండయ్య, బసవపున్నయ్య, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, అబ్బూరి లక్ష్మీనారాయణ, హుస్సేన్, డాక్టర్ భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వ్యక్తిగత ప్రతిష్ట కోసం పేర్లు వేసుకోవడం సరికాదు: టిడిపి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ నిధులతో నిర్మించిన కార్యాలయాలకు వ్యక్తిగత ప్రతిష్ట కోసం వారి పేర్లు వేసే సంస్కృతి సరికాదని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవన ముఖద్వారాలకు కొందరు వైసిపి నాయకులు వ్యక్తిగత ప్రతిష్ట కోసం వారు పేర్లు సరికాదని, దానిని తొలగించినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి మున్సిపల్ ప్రజలు పన్నులు రూ.కోటి ఇచ్చారన్నారు. మరో రూ.కోటిని అప్పటి మున్సిపల్ మంత్రి పి నారాయణ నిధులు మంజూరు చేశారన్నారు.స్టాట్ అప్ గ్రాంటు క్రింద రూ.50 లక్షలు అందజేశారన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనానికి తాము కట్టించుకున్నట్లు వైసిపి నేతలు ముఖద్వారాలకు పేర్లు వేసుకోవడాన్ని తెలుగుదేశం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అందుకే ఎన్‌డిఎ కూటమి నాయకులు ఆ గేట్లును తొలగించినట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జి రాఘవరావు, పట్టణ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, టిడిపి జిల్లా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, పుట్టా బ్రహ్మయ్య, సూరంపల్లి హనుమంతరావు, ముప్పూరి చలమయ్య, బుజ్జి, నర్రా నాగరాజు, స్వామి, నాయకులు పాల్గొన్నారు.

వైసిపికి శీలం రాము రాజీనామా

ప్రజాశక్తి-శింగరాయకొండ



మాట్లాడుతున్న శీలం రాము

వైసిపికి రాజీనామా చేస్తున్నా నని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము ప్రకటించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. వైసీపీలో జరిగిన కొన్ని అవమానాల వల్ల ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి వెళుతున్నానని, ఆ పార్టీలోనే ఉంటానని వివరించారు.

సహృద్భావ వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

- ఓవర్ లోడింగ్ కట్టడికి చర్యలు
- అధికారులకు జెసి ఆర్.గోపాల్‌కృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా సహద్భావ వాతావరణంలో బక్రీదు పండుగను జరుపుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ తెలిపారు. ఈ నెల 17న బక్రీదు పండుగ దష్ట్యా ముస్లిం, హిందూ మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం ప్రకాశం భవనంలోని తన ఛాంబరులో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. బక్రీద్ నేపథ్యం, జంతువధ, జిల్లాలోని పరిస్థితులు, గతంలో జరిగిన సంఘటనలపై సమీక్షించి, ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారి బేబీరాణి జంతువధ నిషేధచట్టాలను వివరించారు. ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జరుగకుండా విఘా మరింత పెంచుతామన్నారు. డిపిఒ ఉషారాణి మాట్లాడుతూ ముస్లిం ప్రార్ధనా మందిరాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని ఇప్పటికే గ్రామస్థాయి సిబ్బందిని ఆదేశించామన్నారు. ఆది, సోమవారాలు పంచాయితీ సెక్రటరీలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. హిందూ, ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఇతరుల మనోభావాలు



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

దెబ్బతినకుండా ఆధ్యాత్మిక భావంతో ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి తమ సంప్రదాయ ఆచారాలను పాటిస్తే సమస్యలు తలెత్తవని అభిప్రాయపడ్డారు. జెసి మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్ కట్టడికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 18 చెక్ పోస్టులలో రవాణా, పశుసంవర్ధక, పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి ఒక ఉద్యోగి ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. గతంలో ఘర్షణలకు దారితీసిన ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్)పై ఈసారి మరింత దష్టి సారిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాలతో పాటు మండలం మొత్తం పారిశుధ్య పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈఒపిఆర్‌డిని ఆదేశించామన్నారు. వెటర్నరీ డాక్టర్లు అందరూ ఆది, సోమవారాలలో ఖచ్చితంగా ఆయా మండల కేంద్రాలలో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. మాంసాహారం తినడం, ఇతర ఏవైనా కారణాలతో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా సబ్ సెంటర్లు, పి.హెచ్.సి.లలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను గుర్తిస్తే బక్రీద్ ముగిసే వరకు వాటిని సంరక్షించేలా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వ అధికారులకు స్థానిక ప్రజలు, మత పెద్దలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో తొలుత మున్సిపాలిటీలలో శాశ్వత ప్రాతిపదికన కబేళాలు, చేపల మార్కెట్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపేలా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ప్రత్యేక కంట్రోల్ సెంటర్

బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువుల రవాణా, జంతువధను గుర్తించినా, వైద్య, పోలీసు సహాయం అవసరమైనా, పారిశుధ్య పనులలో లోపాలు గుర్తించినా వేరుగా జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకురావాలని ప్రజలకు, మత పెద్దలకు జెసి సూచించారు. ఇందుకోసం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో 7093472086, 8096257844 నెంబర్లతో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పశుసంవర్ధక, వైద్య శాఖల అధికారులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని జెసి తెలిపారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.నారాయణ, ఒంగోలు, కనిగిరి ఆర్‌డిఒలు జివి సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఒంగోలు డిఎస్‌పి కిషోర్ బాబు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, మర్కాపురం, కనిగిరి, దర్శి మున్సిపల్ అధికారులు, వైద్య శాఖ డిపిఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాధిత బంధువులకు రక్తం అందిస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - అద్దంకి

రక్తదానం చేయడం ద్వారా మరొక వ్యక్తిని బ్రతికించిన వారమవుతామని, రక్త దానం ప్రోత్సాహకులు చుండూరి మురళి సుధాకర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సరిమెళ్ల కోటేశ్వరరావు కుమార్తె 10వ తరగతి విద్యార్థిని సరిమెళ్ల సన్నిధి కామెర్లతో రక్తహీనత కారణంగా రావినూతల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు బి పాజిటివ్ గ్రూప్ రక్తం కావలసి ఉండగా అద్దంకికి చెందిన వినాయక మెడికల్స్ అధినేత, ప్రముఖ రక్త దాన ప్రోత్సాహకులు చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రక్త దానంకు అంగీకరించి రక్త దానం చేశారు. మురళీ సుధాకరరావు ఆధ్వర్యంలో 423వ రక్త దానం చేశారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ రఫీ, అంకం నాగరాజు, కొండముది బాపూజీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ సుబ్బారెడ్డి

ఆర్‌బికే సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - పంగులూరు

ఎరువుల షాపుల డీలర్లు అందరూ స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లను వ్యవసాయ అధికారిచే తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని మార్టూరు ఎడిఎ కెవి .శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆర్బికే సిబ్బందికి, ఇన్పుట్ డీలర్లకు స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీలర్లు అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. ఎఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎరువుల దుకాణాల ఆవరణలో జీఎస్టీలో ఉన్న చిరునామా ప్రకారం ఎరువుల దుకాణం పేరు, డోర్ నెంబర్‌తో సహా బోర్డు, స్టాక్ బోర్డు, ఎరువుల ధరల పట్టిక అందరికీ కనిపించే విధంగా అమర్చుకోవాలని అన్నారు. బాపట్ల బిఎఓ ఆఫీసు టెక్నికల్ ఎఒ తిరుమలరావు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్‌లో నిల్వలు, గోడౌన్‌లో ఉన్న నిల్వలు, ఈపిఓఎస్ మిషన్ నిల్వలు ఎప్పటికప్పుడు వ్యత్యాసం లేకుండా సరిచూసుకోవాలని చెప్పారు. ఎలాంటి తేడాలు కనిపించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, ఇన్పుట్ డీలర్లు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు తెలిపారు. కళాశాల్లో శనివారం జరిగిన సమావేశంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ప్రస్తుతం కళాశాల్లో బిఎస్‌సి బోటనీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ ఎకనామిక్స్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అనుభవజ్ఞులు, నిష్ణాతులైన సిబ్బందికి తోడుగా జెకెసి ద్వారా క్యాంపస్ ప్లేస్మెంట్లు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల కోసం పనిచేస్తా

ప్రజాశక్తి - చీరాల

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. వాడరేవు మత్స్యకారులతో ఆయన శనివారం మాట్లాడారు. మత్స్య సంపదను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో నష్టపోతున్నారని అన్నారు. సమావేశంలో ఓసిపిల్లి బాబీలు, రాకాతి శివ, యజ్జల బాబ్జి, ధోని కనకరావు, కొడ రవి, పిక్కి దేవుడు, ఓసిపిల్లి యేసు, బొంది పోలిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఎదగాలి



అద్దంకి సభలో మాట్లాడుతున్న ఎంఇఒ బి సుధాకర్

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు అధ్యక్షత జరిగిన సభలో ఎంఇఒ బి సుధాకర్ మాట్లాడారు. జూలై 11వరకు ప్రతి హేబిటేషన్‌లో ఎన్యుమరేషన్ చేయించి క్లస్టర్ రిసోర్స్ పర్సన్లతో అందరూ పిల్లలు పాఠశాలకు హాజరవునట్లు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణకుమారి, ప్రధానోపాధ్యాయం శ్రీనివాసరావు మాట్లాడారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పూజితకు ఎంఇఒ సుధాకర్ బహుమతి ప్రధానం చేశారు. ఆంగ్లంలో ఎక్కువ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు శ్రీనివాసరావు ముక్కుపుడకలు అందించారు. ఎంఇఒ గంగాధరరావు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : బడి బయట ఉన్న పిల్లలు, బడిలో నమోదు కానీ 6నుండి 14ఏళ్ళ వయస్సు గల బాల బాలికలను గుర్తించి బడిలో చేర్చేలా సిఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ కృషి చేయాలని ఎంఇఒ ఎంసిహెచ్ వస్రాం నాయక్ కోరారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాల్లో చేర్పించే కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఓ బసవరాణి, ఎంఈఓ-2 కె ప్రేమలత, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : బడి మానేసి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ నీలం దేవరాజ్ సూచించారు. ఐలవరంలో జరిగిన సమావేశంకు హెచ్‌ఎం మాచర్ల మోహనవు అధ్యక్షత వహించారు. బాలికలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు. వేమూరు ఎంఈఓ వెంకటేశ్వరరావు విద్యార్థులకు అక్షరాలు నేర్పించి బడిలో చేర్పించారు.

వేటపాలెం : పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని 25 పాఠశాలల విద్యార్థులకు 5500 పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. ఎంఇఒ సుబ్బయ్య, పురుషోత్తం మాట్లాడుతూ నోటు పుస్తకాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. విశ్రాంతి ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వర రావు, హేమంత్ కుమార్, హెచ్‌ఎం నారాయణస్వామి, బిబిహెచ్ స్కూల్ ఉపాధ్యక్షు లు ఏకాంబరేశ్వరబాబు, ప్రత్తి వెంకట సుబ్బారావు, ఎస్‌విఎల్ ప్రసాద్, శ్రీధరరావు, ప్రత్తి చంద్రశేఖర్, డాక్టర్ రవిబాబు, ప్రత్తి శరత్‌బాబు, నున్నా శివప్రసాదరావు, కరణం మురళీకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులకు అక్షరాలు నేర్పుతున్న ఎంఈఓ వెంకటేశ్వరావు



మార్టూరు ఎంఇఒ ఎంసిహెచ్ వస్రాం నాయక్

పోలీసులకు ప్రశంసాపత్రాలు అందజేత



ఎస్‌పి వకుల్ జిందాల్ చేతులమీదుగా ప్రశం పత్రం అందుకుంటున్న కెకె తిరుపతిరావు, పి సురేష్, నరసింహారావు

ప్రజాశక్తి - పంగులూరు

గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు, సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన పోలీసు అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి కృషి చేసిన 66మంది పోలీస్ అధికారులను ఆయన శనివారం సత్కరించారు. వీరిలో రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావునున ప్రశంసా పత్రంతో ఎస్‌పి సత్కరించారు. మండలంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా సజావుగా ఎన్నికల నిర్వహించేందుకు తిరుపతిరావు కృషి చేశారని పేర్కొన్నారు.మండలంలో ఒక చోట కూడా ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని తెలిపారు.

సంతమాగులూరు : సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిఐ నరసింహారావు, ఎస్ఐ పి సురేష్‌కు పోలీసు జిల్లా కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా మేమేంటో, ప్రశంసా పత్రం అందజేశారు. వీరిద్దరిని మండలంలోని పలువురు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

ప్రజాశక్తి - బాపట్ల

సకల సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లి, దండ్రులు ముందుకు రావాలని ఎంఇఒ ఎస్ నిరంజన్ కోరారు. మండలంలోని గోపాపురం ప్రాథమిక పాఠశాల్లో బడికి పోతాం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలు అందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువును బోధించడంతోపాటు చదువుల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపి చదువు కొనే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. పాఠశాలలో చేరిన ఆరుగురు ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు.

పాఠశాలకు బీరువా బహుకరణ

దివంగత తడవర్తి రాధా కృష్ణమూర్తి, పుష్పావతి స్మారకార్థం వారి కుమారుడు విశ్రాంత ఉపాధ్యాయులు టి వెంకట రంగం, కోడలు, వెదుళ్ళపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గేడ్ ఉపాధ్యాయిని ఎ సరోజిని సహకారంతో పాఠశాలకు బీరువా బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బడుగు శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు అర్షతుల్లాబేగ్, వెంకటరంగం, సిఆర్‌పిలు మాణిక్యరావు, జాన్ వెస్లీ పాల్గొన్నారు.



ఒకటో తరగతి విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఫొటోగ్రాఫర్ గోవిందరెడ్డికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి అద్దంకి

జాతీయ స్థాయి 90వ సిగ్మా ఫోటోగ్రఫీ అఫ్ వర్క్ షాపులో పట్టణానికి చెందిన కొణతం గోవిందరెడ్డి ఫోటోగ్రాఫర్‌గా తన ప్రతిభ చూపారు. ఈ నెల 6నుంచి 12 వరకు కులుమనాలిలో జరిగిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ వర్క్‌షాపుకు హాజరయ్యారు. గోవిందరెడ్డి జనరల్ ఫోటోగ్రఫీలో ప్రతిభ కనబర్చాడు. అకాడమీ చైర్మన్ శేఖర్ చేతుల మీదగా గోవిందరెడ్డి గొల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనను తోటి ఫోటోగ్రాఫర్లు, మిత్రులు శనివారం అభినందించారు.



గోల్డ్ మెడల్‌తో ప్రశంసలు అందుకుంటున్న గోవిందరెడ్డి



శింగరకొండకు కాలినడకన వెళుతున్న టిడిపి కార్యకర్తలు

కాలినడకన 'శింగరకొండ'కు..

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్రంలో తెలుగుదేశం అఖండ విజయం సాధించడం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు, పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాలినడకన సింగరకొండ చేరుకొని ప్రసన్నాంజనేయ స్వామిని శనివారం దర్శించుకున్నారు. తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పరిటాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలోని ఆంజనేయ స్వామి విగ్రహం నుండి భవాని సెంటర్ మీదగా సింగరకొండ వరకు పాదయాత్ర చేపట్టారు. బొమ్మనంపాడు గ్రామం నుండి సింగరకొండ పాలెం మీదగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గుర్రం బలరామ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. నర్రావారిపాలెంకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువకులు బచ్చుల వాసుతో కలిసి దేవస్థానం వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు



నిలిచిపోయిన హై స్కూల్ అదనపు తరగతి గదులు



నిరుపయోగంగా పడి ఉన్న రైతు బజారు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో అభివృద్ధికి నోచుకోని రూ.కోట్ల విలువైన భవనాలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా దర్శనం ఇస్తున్నాయి. తెలుగుదేశం హయాంలో రూపుదిద్దుకున్న ఈ భవనాలను వినియోగించకుండా గత వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసింది. తాజాగా మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి రావడంతో వాటి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించేలా పాలకపక్షం చర్యలు చేపడుతోంది.

పట్టణంలో రూ.కోట్ల విలువైన భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వీటి ఆలనా పాలనా లేకపోవడంతో ఐదేళ్లుగా మూలన పడ్డాయి. రూ.70లక్షల వ్యయంతో పట్టణ నడిబొడ్డున కూరగాయల మార్కెట్ పక్కన 2019ఫిబ్రవరిలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్‌ను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి శాసన మండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ రైతు బజార్ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారం చేపట్టడంతో ఇది కాస్త వినియోగానికి దూరమైంది. వైసిపి ప్రభుత్వం దీన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఐదేళ్లు ఈ భవనం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఎందుకు పనికిరాకుండా రైతు బజార్ నిరర్థకంగా పడి ఉంది. దీని పక్కనే ఉన్న షాదీ ఖానాను 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అతి కొద్ది కాలం మాత్రమే అందుబాటులో ఉన్న ఈ షాది ఖానా ఆ తర్వాత శిథిలమై రెండు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. తాజాగా మూడు నెలల క్రితం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి షాది ఖానా అభివృద్ధికి తన వంతు విరాళాన్ని అందజేశారు. అయితే దీన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే విధంగా అదనపు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. 24 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న షాదీఖానా పరిధిని విస్తరించి అభివృద్ధి చేస్తే గణనీయమైన ఆదాయం వస్తుంది.

అసంపూర్తిగా మున్సిపల్ హై స్కూల్ అదనపు తరగతి గదులు

పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదుల అవసరాన్ని గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం 2017లో రూ.2కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. 14వ ఆర్థిక సంఘం నిధులతోపాటు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వెచ్చించి భవనం నిర్మించారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను అభివృద్ధి చేసే దిశగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలుగుదేశం హయాంలో ఎలా అసంపూర్తిగా ఉన్నాయో ఇప్పుడు ఆ భవనాలు అలాగే దర్శనం ఇస్తున్నాయి. 13వందల మందికిపైగా విద్యార్థులున్న పురపాలక ఉన్నత పాఠశాల్లో అదనపు తరగతి గదుల ఆవశ్యకతను అధికారులు గుర్తించినప్పటికీ ఆ దిశగా అభివృద్ధి చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తాజాగా తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. దీని రూపు రేఖలు మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిరుపయోగంగా స్కౌట్స్ భవనం

1975లో పట్టణంలోని ఉప్పరపాలెం రోడ్డులో నిర్మించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం నిరుపయోగంగా ఉంది. దీన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తెచ్చే విషయాన్ని పాలకులు మర్చిపోయారు. దీని పక్కనే ఒకప్పుడు తహశీల్దారు నివాస గృహం ఉండేది. కాలక్రమేణా అది శిథిలమై పోవటంతో ఇటీవలే దాన్ని తొలగించారు. ఇప్పుడు ఆ స్థలం ఖాళీగా ఉంది.

ఖాళీగా రూ.కోట్ల విలువైన మునిసిపల్ స్థలం

స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పురపాలక సంఘానికి చెందిన అతి పెద్ద ఖాళీ స్థలం ఖాళీగా పడింది. ఏపుగా పెరిగిన చెట్లతో వెక్కిరిస్తుంది. ఒకప్పుడు మున్సిపల్ కమిషనర్ నివాసం ఉండేందుకు ఇక్కడ ఒక భవనం, దాని పక్కనే మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా ఉండేది. అవికాస్త కనుమరుగైపోయాయి. పూర్తిగా శిథిలమైన వీటిని తొలగించారు. దశాబ్ద కాలంగా రూ.కోట్ల విలువైన స్థలం పిచ్చి మొక్కలతో నిండింది. అంతటి విలువైన స్థలాన్ని ఎందుకు వదిలేశారో అంతు చిక్కని రహస్యంగా ఉంది. ఖాళీగా ఉన్న ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో పురపాలక సంఘం ఉంది. ఇలా అనేక ఖాళీ స్థలాలు, అసంపూర్తిగా అభివృద్ధికి నోచుకోని భవనాలు, ప్రారంభోత్సవాలు చేసుకొని వినియోగంలోకి రాని రూ.కోట్ల విలువైన భవనాలు పట్టణంలో అనేకం దర్శనమిస్తున్నాయి. ప్రజా ధనం వెచ్చించిన భవనాలు ఇలా నిరుపయోగంగా పెట్టడం విమర్శలకు దారితీస్తుంది. గత ఐదేళ్లుగా ఖాళీగా ఉంచిన ప్రభుత్వ భవనాలను ప్రస్తుతం అధికారానికి వచ్చిన నూతన ప్రభుత్వమైనా వీటిపై దృష్టిపెట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్ వద్ద ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలం



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న స్కౌట్స్ భవనం



మురళీకృష్ణ, ప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచులు

మధుసూదన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కొల్లూరు

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి విజయ బేరి మోగించిన సందర్భంగా శనివారం మండలంలోని తాడిగిరిపాడు, రాకింపాడు గ్రామాల డ్వాక్రా గ్రూప్ యానిమేటర్లు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసాదును ఆయన ఆఫీసు దగ్గర మర్యాద పూర్వకంగా కలిసి బొకేలు అందజేసి శాలువాతో సన్మానించారు.

కొల్లూరు : ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా సర్పంచులు సంఘం ఆధ్వర్యంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్‌ను విడివిడిగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.



మన గ్రోమోర్ ఎరువుల షాపును పరిశీలిస్తున్న అధికారులు

'మన గ్రోమోర్' షాపులో పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేత

ప్రజాశక్తి - పంగులూరు

మన గ్రోమోర్ విత్తనాల షాపులో పత్తి విత్తనాలకు సంబంధించిన అమ్మకాలు నిలిపేసినట్లు ఎఒ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని విత్తన షాపులను ఇంటర్నల్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్ రామ్మోహనరావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో పంగులూరులోని మన గ్రోమోర్ విత్తనాల షాపును తనిఖీ చేశారు. షాపులో పత్తి విత్తనాలకు సంబంధించి మూల ధ్రువీకరణ పత్రం సరిగా లేనీ కారణంగా రూ.25,920 విలువచేసే పత్తి విత్తనాల అమ్మకాలను నిలిపేసినట్లు తెలిపారు.



తాగునీటి కుళాయిలు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

యానాది సంఘానికి తాగునీరు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట పంచాయతీ నవ జ్యోతి యానాది సంఘంలో మంచినీటి కుళాయిలను శనివారం ప్రారంభించారు. శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ఆర్థిక సాయంతో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. ప్రజలకు తాగునీరు సరఫరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నాసిక వీరభద్రయ్య, బుద్ధి బసవాచారి, గుత్తి వీరప్రసాదు, నిమ్మని వెంకట పిచ్చయ్య, ఎస్‌కె అజీమ్, ఎస్‌కె రఫీ, అర్జున్, బొడ్డు రవి, పంచాయతి సెక్రటరి ఎం శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల



బాపట్లలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

భూసార పరీక్షలపై రైతులు పూర్తిస్థాయి అవ గాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం ఉష రైతులకు సూచిం చారు. ఏరువాక కేంద్రం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మూర్తి రక్షణ నగర్, మూలపాలెం గ్రామాల ఎస్సీ రైతులకు భూసార పరీక్షలపై శని వారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంతో వాతావరణ కాలుష్యంతోపాటు పంటలపై మితిమీరిన రసాయనాలు వినియోగించడంతో భూమి సారం కోల్పోయి నిస్సారం అవుతుందని అన్నారు. దీంతో రైతులు భూమిలో ఏ రకమైన పంటలు సాగుచేసినా పంట దిగుబడులు సక్రమంగా రావడం లేదని అన్నారు. భూమిలో పోషక లోపాలను గుర్తించి ప్రతి రైతు పొలంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు ద్వారా భూమిలో పోషక లోపాలను గుర్తించి అవసరమైన సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారాన్ని పెంచుకోవాలని అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సిటీ కో – ఆర్డినేటర్ నూతలపాటి శ్రీలత అధ్యక్షతన దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో – ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు మాట్లాడారు. మూలపాలెం వ్యవసాయ సహాయకులు బి మల్లికార్జునరావు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిపారు.

వేమూరు : స్థానిక మార్కెట్ యార్డులోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నందు వ్యవసాయ సహాయకులు, ఇన్పుట్ డీలర్లకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఎఒ సిహెచ్ సునీత మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణపై సూచనలు చేశారు. ఇన్పుట్ డీలర్లు ఎంఆర్‌పి ధరలకు మించి అమ్మితే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. తప్పనిసరిగా కొనుగోలు చేసిన సరుకు బిల్లు అందజేయాలని సూచించారు. బాపట్ల డిఎఓ కార్యాలయం ఎడిఎ ప్రవీణ పాల్గొన్నారు.

అమర్తలూరు (చెరుకుపల్లి) : ఎంఆర్‌పిలకే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించాలని ఎడిఎ శ్రీలక్ష్మి సూచించారు. బిల్లులు తప్పకుండా ఇవ్వాలని అన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని అన్నారు. మట్టి నమూనాలపై వివరించారు. కార్యక్రమంలో డాట్ సైంటిస్ట్ జయ రాధాకృష్ణ, బాల మురళీధర్, ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ హామీ

ప్రజాశక్తి - పంగులూరు



ఎంపీని కలిసిన పంగులూరు టిడిపి నాయకులు

బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు అద్దంకి అభివృద్ధికి తన సహకారం అందిస్తానని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పంగులూరు మండల టిడిపి నాయకులకు హామీ ఇచ్చారు. బాపట్లలోని ఎంపి నివాసంలో మండలానికి చెందిన టిడిపి నాయకులు శనివారం కలిశారు. ఎంపీగా విజయం సాధించినందుకు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గంను తన శక్తి వంచన లేకుండా అభివృద్ధి చేస్తానని అన్నారు. అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గంను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి తన విజయానికి కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిని కలిసిన వారిలో తెలుగుదేశం నాయకులు, డైరీ మాజీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, వలపర్ల సుబ్బారావు, కల్లంవారిపాలెం అధ్యక్షులు గుదిబండ్ల చిన్న ఆదిరెడ్డి, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్తపూడి ఏసోబు (చిన్న), ఎల్లాల నాగిరెడ్డి, బాచిన చౌదరి బాబు ఉన్నారు.

వర్షంతో ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

ప్రజాశక్తి - పర్చూరు

వాతావరణం శనివారం ఒక్కసారిగా మారింది. పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోత, ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఒక్కసారిగా చల్లబడిన వాతావరణంతో ప్రజలు కొంత సేద తీర్చుకున్నట్లు అయ్యింది. విద్యుత్ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా గాల్పుల వల్ల విద్యుత్తు నిలిపివేశారు.



గోవధ నిషేధ చట్టాన్ని

ఎవరైనా అతిక్రమిస్తే కఠినచర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గోవధ నిషేధ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జూన్ 17న బక్రీద్ సందర్భంగా ఏటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసు కోవాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. గో సంరక్షణ చట్టం- 2017, జంతు సంరక్షణ చట్టం 1977ల మేరకు గోవుల అక్రమ రవా ణా నేరమని, గోవులను వధించడం పూర్తిగా నిషేధమని, ఈ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన, సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట ముందస్తు భద్రత చర్యలు తీసుకుంటున్నామని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే, ప్రజలు వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100, 112కు కాల్ చేసి సమాచారాన్ని అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ప్రజలకు తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో

రిలీఫ్ మంజూరు చేస్తాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి కేసులలో రిలీఫ్‌ను వీలైనంత త్వరగా మంజూరు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, సచివాలయాలు, విలేజ్ వాలంటీర్ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. కొత్తగా మంత్రి పదవిని చేపట్టిన డాక్టర్ బాల వీరాంజనేయ స్వామిని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ నాయకత్వంలో రాష్ట్ర సచివాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించామని, తప్పనిసరిగా అతి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి కేసులలో రావలసిన రిలీఫ్‌ను మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో రిలీఫ్ మంజూరు చేయకపోవడం అత్యంత దారుణమైన సంఘటనని తెలిపారు. ఒక పక్క పెత్తందార్లతో దళితులు, గిరిజనులు దెబ్బలు తిని, అవమానపడి ఉన్న వారి పట్ల సానుభూతి లేకుండా ప్రభుత్వం నుండి రావలసిన నిధులను మంజూరు చేయకపోవడం, బాధాకరమన్నారు. కొమ్ము సుజన్ మాదిగ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో సుమారుగా ఎస్‌సి, ఎస్‌టి కేసులలో 6 కోట్లు రావాల్సి ఉందని, వాటిని బాధితులకు ఇప్పించే విధంగా సహకరించాలని కోరారు. టిడిపి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పిఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జయరాజు, కుమార్, అభిషేక్, శాంత్వన సేవాసమితి జిల్లా అధ్యక్షులు జయకుమార్, ఉద్యోగ సంఘ నాయకులు జేమ్స్ పాల్గొన్నారు.

